విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23,సెప్టెంబర్ 2023

రాష్ట్రస్థాయి మహాధర్నా జయప్రదం చేయండి

ఏపిమధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేష్‌బాబు

విశాలాంధ్ర - పాములపాడు : జగనన్న గోరుముద్ద పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కనీస వేతనాల పెంపు కై గోరుముద్ద విద్యార్థుల మెస్ చార్జీలు తక్షణమే పెంచాలని కోరుతూ విజయవాడలో సెప్టెంబర్ 25న జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ బాబు పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళ గడిచినప్పటికీ వైసీపీ ప్రభుత్వం మహిళా కార్మికులకు ఇచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయడం లేదని గత నాలుగేళ్లుగా రూ.3వేల వేతనంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల కుటుంబం ఎలా జీవనం కొనసాగిస్తారని ప్రశ్నించారు. కష్టపడి పనిచేసే మిడ్ డే మిల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచకుండా విస్మరిస్తుందని అడగని వారికి సహాయం చేస్తుందఅన్నారు. గత ప్రభుత్వంలో 2019లో పెంచిన వేతనాల జీఓను అమలు చేస్తుందన్నారు. రోజుకు 8 గంటల పాటు పనిచేస్తు ప్రభుత్వ పథకాన్ని కొనసాగిస్తున్న వీరి శ్రమను రాజకీయ ప్రచారాలకు ఉపయోగిస్తుందన్నారు.తనపేరు మీద జగనన్న గోరుముద్ద అని పెట్టుకొని నూతన మెను అమలు చేయాలని చెప్పిన సీఎం మెస్ చార్జీలు ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం విపరీతంగా నిత్యావసర ధరలు పెరిగాయని రూ. 8లకు ఒక పూట భోజనం ఎలా సాధ్యం అవుదుతుందన్నారు. ఎమ్మెల్యేల పిల్లలు ప్రభుత్వ స్కూల్లో చదివితే జగనన్న గోరుముద్ద పథకం ఎలా అమలు అవుతుందో తెలుస్తుందన్నారు.కార్మికుల కష్టంతో ఈ పథకం నడుస్తుందన్నారు. నాలుగేళ్లుగా అనేక పోరాటాలు మహిళా కార్మికులు చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని పేద విద్యార్థుల పై ప్రభుత్వం కనికరించాలని,కార్మికుల వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలన్నారు, వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈనెల 25న ధర్నా చౌక్ లో జరిగే శాంతియుత "మహాధర్నా" లో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, జయమ్మ లక్ష్మిదేవి,ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నరు.

ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-బేతంచర్ల రూరల్ : ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మండల అధికారులను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో జగనన్న చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న జెసి మాట్లాడుతూ ప్రజలు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు.అలాగే మండలంలోని ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, తహశీల్దార్ నరేంద్ర నాథ్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్న, మండలాధ్యక్షులు బుగ్గన నాగ భూషణ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, ఆర్థిక మంత్రి పిఏ శ్రీనివాసరెడ్డి, మండల అధికారులు, ఆయా సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు,అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. నీట మునిగిన పంటపొలాలు

రుద్రవరం: నీట మునిగిన పత్తి పంట చూపుతున్న రైతు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రైతులు సాగు చేసిన పత్తి ,జొన్న , పంటలు నీట మునిగాయి. రైతులు కోసిన మొక్కజొన్న గింజలు తడిసిపోయాయి. మండల పరిధిలో కురిసిన భారీ వర్షానికి నంద్యాల నుండి రుద్రవరానికి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ప్రస్తుత ఏడాదిలో శుక్రవారం కురిసిన వర్షం పెద్ద వర్షం కావడంతో వంకలు వాగుల్లో నీరు సమృద్ధిగా పారింది. ఎరుగుడిదిన్నె, పేరూరు ,చిలకలూరు, గ్రామాల సమీపంలో ఉన్న వక్కిలేరు వాగు పొంగి ప్రవహించడంతో 3, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అవతల ఉన్న గ్రామాలకు పనుల నిమిత్తం వెళ్లే కూలీలు నీటి ప్రవాహము కారణంగా వెళ్లలేకపోయారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న దోర్ని ప్రాంతంలో రైతులు సాగుచేసిన పత్తి పంటలోకి వర్షపు నీరు అధికంగా చేరి పంట మొత్తం నీట మునిగిపోయింది. ఆర్ కొత్తూరు సమీపంలో గత వారం రోజుల క్రితం సాగుచేసిన జొన్న పంట వర్షపు నీరు చేరి పంట పూర్తిగా చనిపోయి పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు సేద్యపు విత్తనాల ఖర్చులు నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన మొక్కజొన్న పంట కోత కోసి రోడ్డుపై ఆరబెట్టడంతో వర్షం కారణంగా కొన్నిచోట్ల తడిసిపోయింది. తిప్పారెడ్డి పల్లి గ్రామ సమీపంలో టి లింగం దిన్నె వైపు నుంచి ప్రవహిస్తున్న వంక కారణంగా రైతులు సాగు చేసిన వరి పంటలో నీరు చేరి పంట అంతా మునిగిపోయింది. సిరివెళ్ల రుద్రవరం గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించడంతో ఆర్టీసీ బస్సులు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నంద్యాల వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షంతో నీట మునిగి పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు అధికారులను కోరుతున్నారు.

రుద్రవరం: వంతెనలపై పొంగి పారుతున్న నీరు

కొలిమిగుండ్ల : మండలంలోని కొన్ని గ్రామాలలో గురువారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. మండలంలోని పెట్నీకోట, గోరుమాని పల్లి, మీర్జాపురం, బెలుం,బెలుం సింగవరం తదితర గ్రామాల పరిధిలో భారీ వర్షం కురువగా మిగిలిన గ్రామాల్లో మోస్తారు వర్షం పడింది.పెట్నీకోట గ్రామ పరిధిలోకొండల్లో కురిసిన భారీ వర్షానికి పెద్దవంక పొంగి ప్రవహించడంతో కొలిమిగుండ్ల పరిధిలోని సద్దల వెంగన్న చెరువుకు భారీగా వర్షపునీరు రావడంతో పూర్తిగా నిండి అలుగు పారుతున్నది. సమాచారం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి,మండల కన్వీనర్ అంబటి గురువు రెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి తదితరులు చెరువు వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికిపూజలు చేశారు. దీంతో కొలిమిగుండ్లలోని వంక కూడా మోస్తరుగా పారుతున్నది. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఆయా గ్రామాల్లో సాగుచేసిన పంటలు జీవం పోసుకున్నాయి.

కొలిమిగుండ్ల :గంగమ్మకు పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర- ఆత్మకూరు టౌన్: రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారి రాయుడు అవగాహనా కార్యకమంలో భాగంగా పిలుపు నిచ్చారు. 18 నుండి 65 సంవత్సరాల లోపు వారు రక్తదానం చేయవచు అని తెలిపారు. మహిళల ప్రసవ సమయంలో, సర్జరీ సమయాల్లో అధికంగా రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు.బరువు తగ్గడంలో సహాయపడుతుంది, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఇతరులకు సహాయ పడే విధంగా సేవభావం కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో టీ బి సూపర్వైజర్ రవి కుమార్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ప్రసాద్,సీనియర్ అధ్యాపకులు పద్మావతి, విద్య సాగర్, చంద్ర శేఖర్ ఎన్. ఎస్. ఎస్. కో-ఆర్డినేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నందవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్,సెలెక్షన్ పోటీలో ప్రభుత్వం ఉన్నత పాఠశాల కోవెలకుంట్ల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. అండర్ 17 విభాగంలో కబడి పోటీలో మహేంద్ర, అండర్ 14 విభాగంలో జగన్, వరుణ్,నరేష్ మొదలైన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనారు. అండర్ 17 త్రో బాల్ లో జగదీష్, జయచంద్రలు యోగాలో నరసింహ తేజ, సుంకిరెడ్డి అండర్ 14 యోగ విభాగంలో జగన్ అండర్ 17 టెనికాయిట్ లో సురేంద్రబాబు,రంజిత్ కుమార్,ప్రభాస్,దినేష్‌లు అండర్-14లో అబ్దుల్,రజాక్, షంషీర్ బ్యాడ్మింటన్‌లో మొయినాలి ఎంపిక కాబడినారు. వారిని ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగశేషుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు బి వెంకటేశ్వరరెడ్డి, జహీరాబీలు అభినందించారు. వీరు జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యేలా ప్రయత్నించి కృషి చేయాలని తెలిపారు.

ఫలించిన ఎమ్మెల్యే శిల్పా కృషి

సిద్ధాపురం మైంటెనెన్సుకు రూ.1.6 కోట్లు మంజూరు

విశాలాంధ్ర -ఆత్మకూరు రూరల్ : ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కృషి ఫలించింది. సిద్ధాపురం ఎత్తిపోతలకు సంబందించిన రెండేళ్ల మైంటెనెన్సు బకాయిలు ప్రభుత్వం మంజూరు చేసింది. సిద్ధాపురం పథకం నిర్వహణలో ఆదినుంచి హంసపాదులు పడుతూనే ఉన్న విషయం తెలిసిందే. నిధులు సమయానికి రానందు వల్ల మోటార్ల కు ఏదైనా రిపేర్లు వస్తే మైంటెనెన్సు కాంటాక్ట్ ఉన్న వారు చేతులు ఎత్తేయడం చూస్తూనే ఉన్నాం.ఈ మధ్య ఋతుపవనాల ఆలస్యం వల్ల విబిఆర్ కు ఆదర్శంగా చేరుకున్నావా రెండు జలాలను సిద్ధాపురం మళ్లించేందుకు ఇంజన్లు స్టార్ట్ చేస్తే మొరాయించిన సంగతి విదితమే. వాటి రిపేర్లకు రెండు లక్షల రూపాయలు దాకా ఖర్చవుతుందని చెబితే ఎమ్మెల్యే శిల్ప స్వయంగా డబ్బులు చెల్లించిన సంగతి కూడా తెలిసిందే. రెండు నెలల క్రితం నంద్యాలలో జరిగినటువంటి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో , సిద్ధాపురం నిర్వహణకు నిధులు లేకపోవడంపై ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి ధ్వజమెత్తిన సంగతి రైతులకు విధితమే. సిబ్బందికి కనీసం జీతాలు అయినా ఇస్తారా లేదా అంటూ ఆనాడు ఫైనాన్స్ మినిస్టర్ బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డిని నిలదీశారు. దీంతో ఆ ఫైల్ విషయమై బుగ్గన స్వయంగా వాకబు చేసి తెప్పించుకున్నారు. ఆ తర్వాత కూడా ఎమ్మెల్యే శిల్పా ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అధికారులతో పలు మార్లు చర్చించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే శిల్పా కృషి ఫలించి 2020 -21 మరియు 2021 -22 ఆర్థిక సంవత్సరాల గాను,రు 1.66 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో 2022 -23 ఆర్థిక సంవత్సరానికి గాను సిబ్బంది జీతభత్యాలు కూడా ఉన్నాయి.

పొగాకు ఉత్పత్తుల ను నిషేదించాలి

విశాలాంధ్ర - వెలుగోడు : పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని వెలుగోడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో ధూమపానానికి మూల కారణమైన పొగాకు ఉత్పత్తుల నిషేధం మీద విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని, యువత ధూమ మద్యపానాలకు దూరంగా ఉండాలని,క్రమశిక్షణ వినయ విధేయతలతో సన్మార్గంలో పయనిస్తూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆయన విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, సైన్స్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, నాగవాణి,మొయిద్దీన్, సురేందర్ సింగ్, ఫైజులా పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి



విశాలాంధ్ర - చాగలమర్రి : సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా కోరారు.శుక్రవారం మండలంలోని శెట్టి వీడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులు పరిశీలించారు.సచివాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉండాలని, వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ కొండారెడ్డి,పంచాయితీ కార్యదర్శి స్వప్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఆయా క్రీడల్లో రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రసేనారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంటర్ విద్యార్థులు రవిరాజు వాలీబాల్ నందు, దస్తగిరి,ఉదయ్ హ్యాండ్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు,అండర్ -17లో హ్యాండ్ బాల్‌లో శ్రీకాంత్, కె.వికార్తీకులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక య్యారన్నారు. త్రోబాల్ జీవిత, అండర్ 14 కబడ్డీ నరసింహ, వాలీబాల్ క్రీడ లో శ్రీకాంత్ రెడ్డి, శంకర్,అబ్దుల్లా ఎంపికైనట్టు పీడీ గంగాదేవి తెలిపారు.జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు అభినందించారు. జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా సత్తా చాటి స్కూలుకు మంచి పేరు తేవాలని వారు విద్యార్థులను కోరారు.

జిపిఎస్ వద్దు.. పాత పెన్షన్ అమలు చేయాలి

విశాలాంధ్ర- ప్యాపిలి : ప్రభుత్వం తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కౌన్సి లర్ నాగరాజు, మండల ఫ్యాప్టో నాయకులు చంద్రమౌళి, చిన్నపరెడ్డి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యా య సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. విరామ సమయంలో జీ.పీ.ఎస్.కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యమంతి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సి.పి.ఎస్ విధానం రద్దు చేస్తానని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరములు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు సీ.పీ.యస్ ను రద్దు చేయలేదు. పైగా ఇప్పుడు సి.పి.ఎస్ రద్దు చేయకుండా జి.పి.ఎస్ పేరుతో మరో మోసపూరిత పెన్షన్ విధానాన్ని ఉద్యోగులకు బలవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చేయడం ప్రారంభించారు. పేరులోనే గ్యారెంటీ ఉంది కానీ జి.పి.ఎస్ విధానంలో పెన్షన్ కు గ్యారెంటీ లేదు అని ఆరోపించారు. జి.పి.ఎస్ విధానంను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కలిసివచ్చే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఒక బలమైన ఉద్యమ కార్యాచరణ చేపడతామని వారన్నారు.ఇందులో భాగంగా మొదట నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరవ్వడం, తదుపరి తాలూకా స్థాయిలో నిరసన కార్యక్రమాలు, ఈనెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. మస్తాన్‌వలి, శ్రీనివాసులు, మమత, సరోజమ్మ, చాముండేశ్వరి, క్రిష్ణవేణమ్మ, లిలెమ్మ, గోపాల్,మద్దిలేటి, కంబగిరి, దివాకర్, శ్రీనివాసులు, రాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం-విశాలాంధ్ర : అనేక రాష్ట్రాలు పాత పెన్షన్ అమలు చేయాలని ముందుకు వెలుతుంటే మన రాష్ట్రంలో మాత్రం జీపీఎస్ అమలుకు చట్టం తేవడానికి పాలకులు ఉవ్విళ్లూరు తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వేంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వ సంవత్సరం లోకి అడుగు పెడు తున్న సందర్భంగా హిందూపురం నుంచి విజయ వాడకు నిర్వహిస్తున్న ప్రచారయాత్ర పాణ్యం చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికలకు ముందు పాత పెన్షన్ అమలు చేస్తానని హామీ ఇచ్చాడని.. ఇచిన మాట మార్చి జిపిఎస్‌ను తెర మీద కు తెచ్చాడని,జీపీఎస్ అమలు చేయమని ఎవరు అడిగారని అయన విమర్శించారు. బలవంతంగా జీపీఎస్ అమలును రుద్దితే పోరాటాల ద్వారా తిరగబడతామని హెచ్చరించారు.

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్,జె.సుధాకర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఎం వి సుబ్బారెడ్డి,జిల్లా ఆఫీస్ బేరర్ లు సత్య ప్రకాష్,శాంతి ప్రియ, కిషోర్, రామ్ మోహన్,రామ కృష్ణుడు,రాష్ట్ర కౌన్సిలర్ లు ఐజయ్య, నాగస్వామి నాయక్, సోషియల్ మీడియా కన్వీనర్ అరవింద్, ప్రతాప్,దస్తగిరి మహ్మద్ హుస్సేన్,మధు, వేంకటేశ్వర్లు, గోపాల్, గ్రేసమ్మ, ప్రేమ కాంత్, చంద్ర మోహన్, చంద్ర శేఖర్, శివ శంకర్ జకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆమరణ నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - నంద్యాల : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తూ మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి భూమా అఖిలప్రియ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు కేంద్ర సహాయ మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, ఆలూరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జి గౌరు చరిత, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ వెంకట స్వామి తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుని ఆక్రమంగా అరెస్ట్ చేయించిందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి పతనం ఖాయమని తెలిపారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకపోయినా చంద్రబాబు నాయుడు, లోకేష్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇటువంటి కక్ష పూరిత ధోరణికి పాల్పడ్డారన్నారు. సిఐడి, ఏసీబీ అధికారులు అత్యుత్సహం ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క వైసీపీ నాయకుడు కూడా గెలవ లేదని కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు.కార్యక్రమంలో యువ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, ప్రముఖ న్యాయవాది, టిడిపి నాయకులు తులసిరెడ్డి, మాజీ ఎంపిపి యామా గుర్రప్ప, పలువురు టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన వడ్డెర సంఘం నాయకులు

విశాలాంధ్ర - మిడుతూరు : మండల కేంద్రమైన మిడుతూరులో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై జగన్మోహన్‌ను అఖిల భారత వడ్డెర సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు చక్రధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఎస్ఐల బదిలీల భాగంగా మిడుతూరు ఎస్ఐగా పనిచేస్తున్న మారుతి శంకర్ ను జూపాడు బంగ్లా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.మండల పరిధిలో వివిధ గ్రామాల్లో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐను కోరారు. అనంతరం ఎస్సైని దుశ్శాలువతో సన్మానించారు. వడ్డెర సంఘం నాయకులు మణికంఠ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లు ఐక్యమత్యంతో మెలగాలి : పీరు సాహెబ్ పేట గ్రామంలోని వడ్డెర్లంతా తారతమ్యం లేకుండా ఐక్యమతంతో మెలగాలని వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా నాయకులు చక్రధర్ తెలిపారు. గ్రామంలో వడ్డేరుల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వడ్డెరలను ముద్దాయిలుగా చేర్చడం జరిగిందన్నారు. మిడుతూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు గ్రామంలో శాంతిభద్ర దృష్టిలో ఉంచు కొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ చేసి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశామన్నారు. ముద్దాయిలను కౌన్సిలింగ్ చేసి అదుపులో ఉంచి గ్రామంలో ఎలాంటి శాంతి భద్రత లకు విఘాతం కలవకుండా తగు చర్యలు తీసు కోవాలని, ఎలాంటి గొడవలు రక్తపాతం జరిగిన మీదే పూర్తి బాధ్యతనని న్యాయం కోసం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సౌత్ ఇండియా ఐకానిక్ బెస్ట్ టీచర్ మల్లికార్జున

విశాలాంధ్ర -గడివేముల : గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భీమిశెట్టి మల్లికార్జున సౌత్ ఇండియా ఐకానిక్ బెస్ట్ టీచర్ అవార్డ్ - 2023 కు ఎంపిక అయ్యారనీ పాఠశాల కరెస్పాండెంట్ రామేశ్వరావు తెలిపారు.. అనంతరం పాఠశాల యాజమాన్యం అవార్డు పొందిన మల్లికార్జున దంపతులను ఘనంగా సన్మానించారు.ఇ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వర రావు మాట్లాడుతూ మల్లికార్జున ప్రాథమిక విద్యను మా పాఠశాల అయిన శ్రీ రాజ రాజేశ్వరి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి, ఉన్నత చదువులు వరకు చదివాడన్నాడు.ఇప్పుడు బాల్యం లో విద్యానభ్యసించిన పాఠశాలలోనే గణితం ఉపాధ్యాయునిగా పనిచేస్తూ అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర రావు, కృష్ణకాంత్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేదలకు అండగా వైయస్సార్ భీమా

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : వైయస్సార్ బీమా పేదలకు వరమని బాధిత కుటుంబాలు సద్వినియోగపర్చుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయం నందు మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి తో కలిసి బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ బీమా చెక్కును ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తోళ్ళమడుగు సచివాలయ పరిధిలో ఉమ్మాయిపల్లి తండాకు చెందిన చందు నాయక్ జులై 16న మట్టి మీద కూలి మరణించాడన్నారు. రెండు నెలల లోపు చందు నాయక్ కుటుంబానికి వైయస్సార్ బీమా పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదన్నారు.బాధిత కుటుంబం వైయస్సార్ బీమా డబ్బులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చందు నాయక్ భార్య లక్ష్మీదేవికి బీమా చెక్కును అందజేశారు.కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రచార అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, తొళ్లమడుగు సర్పంచ్ రాజారెడ్డి,ఉమ్మాయిపల్లి తండా సర్పంచ్ లక్ష్మీదేవి, గోపాల్ రెడ్డి,తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుకూతలు కూస్తే బట్టలిప్పి కొడతాం

విశాలాంధ్ర - డోన్ రూరల్: చంద్రబాబు మీద కానీ, మా టీడీపీ కార్యకర్తలపై కానీ తప్పుడు ఆరోపణలు చేస్తూ కారు కూతలు కూస్తే వైసీపీ నాయకులను బట్టలిప్పి కొడతామని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. శుక్రవారం ఎన్టీ రామారావు విగ్రహం వద్ద నిరసన దీక్ష శిబిరం నుద్దేశించి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి అరగంట ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన పేరు గాని, అభివృద్ధిని కానీ చెప్పకపోవడం బుగ్గనకు రాబోయే ఎన్నికలలో సీటు కూడా వస్తుందో లేదో నన్న అనుమానం కలుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి భయంతోనే ముఖ్యమంత్రి జగన్ సభను డోన్ లో ఏర్పాటు చేసుకున్న ఫలితం శూన్యమని తెలిపారు. విలేకరుల సమావేశంలో మేము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా ఆవాకులు చవాకులు వ్యక్తిగత విమర్శలు చేస్తే టీడీపీ చూస్తూ ఊరుకోదని వైసీపీ నాయకులకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

గణేష్ నిమజ్జనం వేడుకలు

కోవెలకుంట్ల :దప్పుల మధ్య నృత్యం చేస్తున్న యువకులు

పాణ్యం : నిమజ్జనానికి తరలి వెళుతున్న గణపయ్య

ఆళ్లగడ్డ : నిమజ్జనానికి తరలివెళుతున్న గణపయ్యలు

జూపాడుబంగ్లా : కేసీ కాలువలో వెళ్లిపోతుంటున్న గణనాథుడు

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23, సెప్టెంబర్ 2023

రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

విశాలాంధ్ర – కోడుమూరు : వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలన్నీ ఎండిపోయి పూర్తిగా దెబ్బతిన్న రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి కృష్ణ,నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్ యాదవ్‌లు డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కలెక్టర్ డాక్టర్ సృజన ఆధ్వర్యంలో చేపట్టిన "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమంలో సీపీఐ నాయకులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలు కలెక్టర్,జాయింట్ కలెక్టర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పట్టణంలో 30 ఏళ్ళుగా ఇంద్రజిత్ గుప్తానగర్ కాలనీవాసులకు ఇళ్లపట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు.కోడుమూరు వర్షాభావ కారణంగా రైతులు వేసిన పంటలు ఎండి, నష్టం వాటిల్లిందని, రైతులకు తక్షణ మే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. సీపీఐ నాయకులు రాజు, రాముడు,చిన్నరాముడు,శేషు కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు డా.షాకీర్,కృష్ణయ్యలతో కలిసి కోడుమూరులో వాహనాల రాకపోకలతో ప్రజలు ఇబ్బం దులు, నియంత్రణలో భాగంగా పట్టణంలోని రోడ్లు వెడల్పు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ సమస్యలన్నింటికీ త్వరలో పరిష్కారం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కోర్సు ఫీజులు విద్యార్థులకు చెల్లించాలి- ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : విద్యార్థుల నుండి వసూలు చేసిన ఫీజులు తిరిగి చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న షాబీర్‌బాషలు డిమాండ్ చేశారు.శుక్రవారం సీఆర్‌భవన్‌లో వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో క్లస్టర్ వర్సిటీలు రెండు మాత్రమే ఉన్నాయన్నారు. అందులో ఒకటి కర్నూలునగరంలో ఉందన్నారు.ఈక్లస్టర్ వర్సిటీకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఫర్ మెన్) కె.వి.ఆర్, సిల్వర్ జూబ్లీ కళాశాలలు అనుబంధంగా క్లస్టర్ వర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈక్లస్టర్ యూనివర్సిటీకి కూడా వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రర్లను డిప్యూటేషన్ మీద ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ క్లస్టర్‌వర్సిటీ ఏర్పాటు తర్వాత వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రర్లకు ప్రిన్సిపల్‌లకు ఒకరంటే ఒకరికి పడక విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనీ ఆరోపించారు.డిగ్రీ సెమిస్టర్ , పీజీ ఫలితాల విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. క్లస్టర్ వర్సిటీలో కొత్తగా అడ్మిషన్‌కి జాయిన్ అవుతున్న విద్యార్థుల నుంచి మిగిలిన విద్యార్థుల నుంచి కూడా కోర్స్ ఫీజుల పేరుతో ముందు గానే డబ్బులు వసూలు చేస్తూ ఉన్నారని ఆరోపించారు. క్లస్టర్ వర్సిటీలో డిప్యూటేషన్ మీద వచ్చినటువంటి రిజిస్టర్ అతని యొక్క డిప్యూటేషన్ కూడా ప్రభుత్వం రద్దు చేస్తే ఇంకా ఇక్కడే పట్టుకొని పాకులాడటం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే రిజిస్టర్,వీసీని క్లస్టర్ యూనివర్సిటీ నుంచి పంపించి వేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు విద్యార్థుల నుంచి వసూలు చేసిన కోర్స్ ఫీజులను తిరిగి విద్యార్థులకు చెల్లించాలని, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన , విడుదలైనప్పుడు మాత్రమే విద్యార్థుల నుంచి కోర్స్ ఫీజులు కట్టించుకోవాలని సూచించారు. కోర్సు ఫీజులు విద్యా ర్థులకు తిరిగి ఇవ్వకపోతే క్లస్టర్‌వర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యను గవర్నర్ దృష్టికి కూడా తీసుకు వెళ్తామని వారు హెచ్చరించారు.సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగరప్రధాన కార్యదర్శి మునిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, నగర నాయకులు రవి, రాజశేఖర్, కళ్యాణ్, అఖిలు పాల్గొన్నారు.

బీసీ బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని పున:ప్రారంభించాలి

ఏపీ మోడల్ స్కూల్ రోడ్డును పున:నిర్మాణం చేయాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర – కోడుమూరు : బీసీ బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని పున:ప్రారంభించాలని,ఏపీ మోడల్ స్కూల్ రోడ్డును పున:నిర్మాణం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు.శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం భవనంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన,జాయింట్ కలెక్టర్ ఎన్. మౌర్యల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కోడుమూరులో మూసి వేసిన బీసీబాలుర ప్రీమేట్రిక్ వసతి గృహాన్ని పున:ప్రారంభం,ఏపీ మోడల్ స్కూల్ రోడ్డులో గుంతలను పూడ్చి రోడ్డును పున:నిర్మాణం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ కోడుమూరులోని కోటవీధి సమీపంలోని ప్రభుత్వ బీసీ బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహం బ్రిటీష్ కాలంలో వందేళ్ళ క్రితం నిర్మించిన భవనం కావడంతో, ప్రస్తుతం ఆభవనం పూర్తిగాశిథిలావస్థకు చేరుకోవడంతోప్రమాదకరంగా మారడంతో విద్యార్థులు హాస్టల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో బీసీ బాలుర ప్రీమెట్రిక్ హాస్టల్ మూసి వేయడం కారణంగా, విద్యార్థులు తమ చదువుల కోసం అమడగుంట్ల, లద్దగిరి గ్రామాల్లో ఉన్న హాస్టల్‌కు వెళ్లి విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. హాస్టల్ భవనం సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అదే విధంగా ఏపీమోడల్ స్కూల్ రోడ్డు గుంతల మయంగా మారడంతో అక్కడికి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. అందరిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఏపీ మోడల్ స్కూల్ రోడ్డు పరిధిలోని గుంతలను పూడ్చి పున:ప్రారంభించాలని జిల్లా స్థాయి అధికారులను కోరామన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకుల సమస్యలు విన్న జిల్లా కలెక్టర్ సృజన స్పందిస్తూ సమస్యలన్ని త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచినట్లు ఏఐఎస్ఎఫ్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర

విశాలాంధ్ర – పెద్దకడబూరు : గ్రామ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర అని సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామసచివాలయం - 1 నందు పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఆధ్వర్యంలో స్వేచ్ఛతా హిసేవ - 2023 కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ మెన్లను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గ్రామ స్వచ్ఛతలో కార్మికులు ప్రముఖపాత్ర పోషిస్తున్నారని, వీరికి గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పాదయాత్ర హామీలు నిలుపుకోవాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరుతూ ఏఐటీ యూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పారిశుద్ధ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సంద ర్భంగా సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి మాట్లాడుతూ పాదయాత్ర సంద ర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ ఔట్ సో ర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తున్నట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.జీపీఎఫ్ ఖాతాలు తెరవడంతో పాటు టైం స్కేల్ కార్మికులను పర్మినెం ట్ చేయాలన్నారు. 2021- 22, 2022- 23 ఆర్థిక సంవత్సరం సరెండర్ లీవ్ వేతనాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో పనిముట్లని కార్మికులకు అందించాలని, కార్మికుల సంఖ్యను పెంచి వారికి పని భారాన్ని తగ్గించాలన్నారు.రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్ కుట్టిన డబ్బులు చెల్లించాలన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన యూనిఫామ్, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు వెంటనే ఇవ్వాలన్నారు. ఏపీజిఎల్ఐ బాండ్లు ఇవ్వాలన్నారు. ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు మేనేజర్ చిన్నారాముడుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప కార్యదర్శి టి రామాంజనేయులు, నాయకులు బతుకన్న,నల్లన్న, రేణుక, మాణిక్యం, సాయి, శివకుమార్, షాలు, సునీత, శాలమ్మ,పద్మమ్మలు పాల్గొన్నారు.

ఉద్యోగులను మోసం చేయడం తగదు

విశాలాంధ్ర–ఆదోని రూరల్ : వైసీపీ అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన మాటను తప్పి జీపీఎస్ విధానాన్ని మంత్రిమండలిలో ఆమోదించి ఉద్యోగులను మోసం చేయడం తగదని ఎస్టీయూ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వీర్ చంద్రయాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విశాలాంధ్ర ప్రతి నిధితో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్రలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించడం దారుణ మన్నారు. 30 ఏళ్ల పాటు ప్రభుత్వానికి ప్రజలకు చేసిన సేవలు ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత జీవితాలకు భద్రత కలిగించే పెన్షన్ విధానం ప్రభుత్వ బాధ్యత కాదా అన్నారు. మాట మార్చి ప్రత్యామ్నాయంగా తలాతోక లేని జీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పి క్యాబినెట్‌లో పెట్టి ఆమోదించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టే విధంగా ప్రభుత్వం తీరు అనుసరిస్తుందని వ్యాఖ్యానిం చారు. జీపీఎస్ అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులను బలవంతం చేస్తే మరో ఛలో విజయవాడ లాంటి ఉద్యమాలను పునరావృతం చేస్తా మని హెచ్చరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ జిపిఎస్ ప్రతిపాదనను విరమించుకుని ఇచ్చిన హామీ మేరకు ఓపిఎస్‌ను అమలు చేసి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వ స్పందించకపోతే ఫ్యాప్టో పక్షాన జరిగే ఉద్య మాలకు ప్రభుత్వ సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు.

కామ్రేడ్ రామాంజనేయులుకి ఘన నివాళి

విశాలాంధ్ర – ఆదోని రూరల్ : సీపీఐ మాజీ మండల కార్యదర్శి కామ్రేడ్ రామాంజనేయులు మూడో వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి సుదర్శన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాన్నిఉద్దేశించి మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబి. నాగరాజు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకుడు శ్రీరాములు,పట్టణ అధ్యక్షులు వైటి.భీమేష్, పట్టణ సహాయ కార్యదర్శి కుమారస్వామి,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కొత్తూరు గంగన్న,సీనియర్ నాయకులు బసాపురం గోపాల్, ఏపీ రైతు సంఘం అధ్యక్షులు మదిరి ఎల్లప్ప, ఇన్సాఫ్ కమిటీ నాయకులు మెకానిక్ వలి తదితరులు పాల్గొని కీర్తిశేషులు కామ్రేడ్ రామాంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఇంటి స్థలం లేని నిరాశ్రయులకు భూపోరాటాలు చేసి ఇళ్ల స్థలాలను ఇప్పించిన ఘనత రామాంజనేయులకు దక్కిందన్నారు.రామాంజనేయులు సీపీఐ మండల కార్యదర్శిగా పనిచేసి పేదల వైపు ఉంటూ ప్రజా పోరాటాలు చేసి హక్కుల సాధన కోసం కృషి చేసిన ఘనత మరువలేనిదని కొనియాడారు.ఆయన పార్టీకి సేవలు చిరస్మరణీయమని,నేటి కార్యకర్తలు,నాయకులు రామాంజనేయులు అడుగుజాడల్లో నడుచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గోవిందు,అస్లాం, రవి ప్రకాష్,సద్దాం,నాగరాజు, ఉరుకుందు,సేకరణ,రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర–ఎమ్మిగనూరు: నియోజకవర్గ కేంద్రమైన ఎమ్మిగనూరులో ఈనెల 24న నిర్వహించనున్న ఏపి రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపనగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శిరంగన్నలు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్‌లతో కలిసి వారు సీపీఐ కార్యాలయంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్ సీజన్లో సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతంగం పూర్తిగా నష్టపోయి అప్పుల పాలయ్యారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంటలను సర్వే చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. అప్పులు తీర్చలేక ఇతర ప్రాంతాలకు రైతులు వలసలు వెళుతుండగా, మరి కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. ఇటీవలే సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో కౌలు రైతుకు అప్పులు అధికం కావడంతోనే ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతన్నను ప్రభుత్వమే బాధ్యత వహించి నష్ట పరిహారం తక్షణమే విడుదల చేయాలన్నారు. రైతంగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ నిర్వహించడానికి ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఎమ్మిగనూరులోని ఎన్జీవో భవన్ నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.సమావేశానికి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ చంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జగన్నాథం, లక్ష్మిరెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొంటా రన్నారు. కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్, నాయకులు మల్లికార్జున గౌడ్,రవి నరసింహులు,రవిలు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే సహించం

విశాలాంధ్ర- పత్తికొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తే సహించేది లేదని సీపీఐ మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండ, డోన్ నియోజకవర్గంలోని చెరువులకు నీళ్లు నింపేందుకు పైప్ లైన్ పనులు పూర్తికాకుండానే హడావుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 18న 77 చెరువులకు నీళ్లు వదులుతున్నామని బటన్ నొక్కి వెళ్లారని, 77 చెరువులు కాదు కదా కనీసం 20 చెరువులకు కూడా నీళ్లు నింపేందుకు అవకాశం లేదన్నారు.పత్తికొండ నియోజకవర్గంలోని బొందిమడుగుల చెరువుకు మాత్రమే నీళ్లు నింపడం జరిగిందని, మిగిలిన చెరువులకు నీళ్లు వచ్చే పరిస్థితి కనపడడం లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతులను, ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. చెరువులకు నీళ్లు నింపే ప్రక్రియను న్యాయబద్ధంగా చేపట్టి నట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయని,సాగు, తాగు నీరు లభిస్తుందన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అధికారపార్టీకి సంబంధించిన పత్రికలో కమ్యూనిస్టులపై అసత్యపు రాతలు ప్రచురించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రభుత్వం రైతులకు మేలు జరిగే విధంగా కార్యరూపం దాలిస్తే, కమ్యూనిస్టు పార్టీలు స్వాగతిస్తాయని రాజాసాహెబ్ సూచించారు.

పశువుల దాణా పంపిణీ

విశాలాంధ్ర – చిప్పగిరి: పశువులకు పౌష్టికాహారం అందించాలని ఉద్దేశంతో సబ్సిడీ కింద దాన పంపిణీ చేయడం జరిగిందని చిప్పగిరి గ్రామ సర్పంచ్ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిప్పగిరి పశు వైద్యశాల నందు గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు ఆధ్వర్యంలో పశువులకు దానా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండలం ఎంపీపీ హేమలత భర్త ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిప్పగిరి పశు వైద్య అధికారిని ప్రసన్న బాయి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఉన్న రైతుల పశువులకు సబ్సిడీ కింద దాన పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగానే చిప్పగిరికి సంబంధించి 120 క్వింటాల్ , రామదుర్గంకు 112 క్వింటాళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 200 కేజీల దాన ప్యాకెట్ రూ.3160 కాగా సబ్సిడీ కింద రైతు చెల్లించవలసినది రూ.1300 మాత్రమేనని కనుక రైతులు పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో కొండయ్య, పంచాయతీ కార్యదర్శి బాలన్న తదితరులు పాల్గొన్నారు.

పీఎంజే నూతన షోరూం ప్రారంభం

విశాలాంధ్ర – కర్నూలు : దక్షిణ భారత దేశంలో పేరుగాంచిన అత్యంత అభిమాన ఉత్తమ జ్యువెలరీ బ్రాండ్ పీఎంజే జువేల్స్ వారు తమ ప్రతిష్టాత్మకమైన నూతన షోరూం ను శుక్రవారం కర్నూలు నగరంలోని జ్యోతి మాల్ ఎదుట, మేడం కాంపౌండ్ నందు ప్రారంభించారు.నూతన షోరూంను డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక ,బిజినెస్ హెడ్ శ్రీరాంరెడ్డి ,పీఎంజే జువేల్స్ కర్నూలు షోరూంహెడ్ రంగారెడ్డిలతో కలిసి మేయర్ బీవై రామయ్య ఆవిష్కరించారు. దక్షిణ భారతదేశంలో ఇది తమ 30వ షోరూం అని యాజమాన్య పేర్కొన్నాది. ఈనెల 27 వరకు ప్రత్యేకంగా వివాహ శుభకార్యాలకు అవసరమైన అద్భుతమైన ఆభరణాల ప్రదర్శనను విస్తృత శ్రేణిలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లా డుతూ " ఇంట విశిష్టమైన ఆభరణాల షోరూం ఆవిష్కరణలో తాను పాలుపంచుకోవటం ఆనందంగా ఉందని, పీఎంజే జువేల్స్ బృందానికి అభినందనలు తెలిపారు.

నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: జిల్లా కేంద్రంలోని బి.రోడ్ సెక్షన్‌లో రాజీవ్ స్వగృహ, ఉల్చాల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా 23వ తేదీ శనివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ డిఈ రాజా రామ్మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదిత్య నగర్, జయసాయి విల్లాస్, స్కంద రెసిడెన్సీ, వీకర్ సెక్షన్ కాలనీ,ప్రకాష్‌రెడ్డి నగర్, ఎన్టీఆర్ బిల్డింగ్స్, లెప్రసీ కాలనీ, బోసిరెడ్డి కాలనీ,ఎలుకూరు బంగ్లాస్, వసుందరటవర్స్, శిల్ప నందనవనం, ఎన్‌వి కుమార్ రెసిడెన్సీ, సిద్దార్థహెరామ్స్, విఘ్నేశ్వర నగర్‌లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.కృష్ణానగర్ 11 కె.వి పరిధిలో కృష్ణానగర్, శరీన్‌నగర్, అబ్బాస్ నగర్, రామచంద్రనగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరా లో అంతరానికి వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భక్తులకు తాగునీటి సరఫరా

విశాలాంధ్ర–ఆదోని రూరల్ : స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటిని ఉచితంగా సరఫరా చేశారు.ముఖ్య అతిథులుగా వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి జై మనోజ్ రెడ్డి పాల్గొని ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభివృద్ధికి ఆమడదూరం నగర శివారు కాలనీలు

విశాలాంధ్ర కర్నూలు సిటీ : కర్నూల్ నగర శివార ప్రాంతాలు ఏవి కూడా అభివృద్ధికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే నగర శివారు ప్రాంత కాలనీల అభివృద్ధిపై కార్పొరేషన్ దృష్టిపెట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కమీషనర్ ,మేయర్ నగర శివారు ప్రాంతాల్ని సందర్శించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని ఈరోజు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డు లో అంతర్భాగమైన మారుతీ నగర్ సమస్యలపై మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా నిర్వహించడం జరిగినది. ఈధర్నా కార్యక్రమానికి సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ వి నాగరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరం స్వచ్ఛాంధ్ర ప్రదేశ్లో కర్నూల్ నగరం మొదటి స్థానం ఉన్నదని గొప్పలు చెప్పుకుంటున్న మున్సిపల్ అధికారులు స్వయానా మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డులో అనేక సమస్యలు తిష్ట వేసుకొని కూర్చున్నాయన్నారు. 19వ వార్డులోని మారుతి నగర్‌లో సిసి రోడ్లు ,మురికి కాలువలు నిర్మించాలని అంగన్వాడి కేంద్రం ,సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్ తేజ, నగర మేయర్ బివై రామయ్య ధర్నా దగ్గరికి వచ్చి వినతిపత్రం స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే మారుతి నగర్ సమస్యలపై దృష్టి పెడతామని సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, సి. మహేష్ నగర కార్యవర్గ సభ్యులు బీసన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శీనివాసులు, నగర అధ్యక్షులు బాబయ్య, మారుతి నగర్ శాఖ నాయకులు సులోచనమ్మ, వెంకటలక్ష్మి,లక్ష్మీదేవి, రేణుక, దప్పు బద్రి, ఆనందమ్మ, శేషమ్మ, రాజు, అనిల్, సయ్యద్ మహబూబ్ బాషా, నాసిర్ మరియు కాలనీ ప్రజలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 44 సంతోష్ నగర్ నుండి మానస ధాభా వరకు తాత్కాలిక బ్యారికేడ్స్ ఏర్పాటు గురించి డిఆర్ఓ అడుగగా 15 రోజుల్లోపు తాత్కాలిక బ్యారికేడ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్‌హెచ్ 40లోని కెజిఎఫ్ ఫుడ్ రెస్టారెంట్ నుండి నంద్యాల హైవే పై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం వరకు తాత్కాలిక బ్యారికేడ్స్ ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ 40 అధికారులను అడుగగా మరుసటి సమావేశం నాటికి శాశ్వత బ్యారికెడ్స్ చేస్తామని అధికారులు తెలిపారు. రహదారులపై ఉన్న అనధికార ఓపెనింగ్స్ పై ట్రాఫిక్, ఎన్హెచ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి అనధికార ఓపెనింగ్స్ పై దృష్టి సారించాలని డిఆర్ఓ ఆదేశించారు. ఎన్‌హెచ్ 40 నందు హైమాస్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరగా, బి.తాండ్రపాడు ప్రాంతంలో రెండు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడానికి అనుమతులు వచ్చాయని త్వరితగతిన ఏర్పాటు చేస్తామని డిఆర్ఓకు వివరించారు. బళ్లారి చౌరస్తా, రాజ్ విహార్ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు గాను మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ సమీక్ష నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామని సంబంధిత శాఖ అధికారులు డిఆర్ఓకు వివరించారు. నగరంలో పలు ప్రాంతాలలో ప్రయాణికుల సౌకర్యార్థం 9 బస్ స్టేషన్లు ప్రతిపాదించడం జరిగిందన్నారు. రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా విస్తరణ పనులకు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు రాజ్ విహార్ జంక్షన్ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కొండారెడ్డి బురుజు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రోడ్డు నుంచి మెడికల్ కాలేజీ, బిర్లా గేట్ జంక్షన్, గాయత్రి ఎస్టేట్ నుంచి బిర్లా గేట్ వరకు ఆక్రమణలు తొలగించేందుకు కూడా మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని అధికారులు డిఆర్ఓకు తెలిపారు. నగరంలో సిసి కెమెరాలపై మున్సిపల్ అధికారులు వివరణ ఇస్తూ నగరంలో 32 చోట్ల సోలార్ తో పని చేసే సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీధర్, ఆర్టీఓ రమేష్, ఆర్టీసి అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు

విశాలాంధ్ర–ఆదోని రూరల్ : పట్టణంలో కుల,మతాలకు వర్గ,భేదాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడు శుక్రవారం గంగమ్మ ఒడికి చేర్చారు. ఉదయం విశ్వ హిందూ పరిషత్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపం నుంచి ఆ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి బహిరంగంగా లడ్డు ఉండే వేలంపాట పాడిన తర్వాత పట్టణ పురవీధుల గుండా గణనాథుని నామాలతో తరిస్తూ మధిర ఎల్ఎల్సి వినాయక ఘాట్ వద్దకు గణనాథునితో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్,తహశీల్దార్ వెంకటలక్ష్మి,మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఎంపీడీవో గీతా వాణి,వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి జయ మనోజ్ రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ శాంత, టీడీపీ నియోజకవర్గ మాజీ ఇంచార్జి గుడిసె కృష్ణమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్తలు శ్రీకాంత్ రెడ్డి,విట్ట రమేష్ తదితరులు చేరుకుని గంగమ్మ దగ్గర ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించి గంగలో నిమజ్జనం చేశారు. విశ్వహిందూ పరిషత్ దగ్గర నిర్వహించిన విగ్రహం మొదలుకొని పట్టణంలో ఉన్న ఆయా కాలనీల నుంచి వినాయకులను భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించే కార్యక్రమం సాగింది. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పట్టణంలో పర్యటిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు మధ్య ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వినాయక గట్టు వద్ద ప్రభుత్వ అన్ని శాఖ అధికారులతో కార్యకర్తలు కల్పించడం జరిగింది. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని ప్రధానదారుల్లో భక్తులకు అన్నదానం, మంచినీళ్లు పలు విధాల సేవా కార్యక్రమాలను దాతలు నిర్వహించారు. వినాయక ఘాటు వద్ద రెండు భారీ క్రేన్ల సహాయంతో వినాయక నిమజ్జనానికి పూనుకోవడం జరిగింది.

బాబుని వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర- హొలగుంద: చంద్రబాబుని ఈసైకో జగన్ ప్రభుత్వం అక్ర మంగా అరెస్ట్ చేసి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉంచిన నేపథ్యంలో వారిని వెంటనే విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రఘుప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు ఆలూరులో రఘుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకా స్థాయి కురువలు పెద్దఎత్తున చేపట్టిన దీక్ష చేపట్టారు. సాయంత్రం దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం తాగించి తాత్కాలికంగ విరమించారు. ఈదీక్షలో నియోజకవర్గ కురువ నాయకులు,కార్యకర్తలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,మండల స్థాయి నాయకులు, ఐటిడిపి, టీఎన్ఎస్ఎఫ్, టీఎన్టియుసి తెలుగు యువత నందమూరి అభిమానసంఘాలు, యూత్ కోట్ల యూత్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి..పర్యావరణం కాపాడుదాం

విశాలాంధ్ర- పెద్దకడబూరు: మొక్కలు నాటి పర్యావరణం కాపాడు కుందామని వైసీపీ నాయకులు అళ్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కంబలదిన్నె లోని స్మశానవాటిక చుట్టూ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మె ల్యే బాలనాగిరెడ్డి,రాష్ట్ర యువనాయకులు ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో గ్రామంలో సొంత నిధులతో ముళ్లకంపను తొలగించడం జరిగిందన్నారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు సకాలంలో వర్షాలు కురవడానికి ఉపయోగపడతాయన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్న లక్ష్యంతో గ్రామాన్ని అభివృద్ధి బాటలు అడుగులు వేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

విశాలాంధ్ర – హొలగుంద : మండలంలోని హెబ్బటం గ్రామపంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శిగా రాజశేఖర్ గౌడ్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యల తీర్చడానికి కృషి చేస్తానని గ్రామాభివృద్ధికి గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ఎంపిటిసి ప్రజలు అధికారులు వాలంటీర్లు గ్రామ సచివాలయం సిబ్బంది సహకరించాలని విజ్ఞప్తి చేశారు ప్రజలకు శుద్ధికరించిన నీరు సరఫరా చేస్తామని గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు వీధి దీపాలు సక్రమంగా వెలిగల చూస్తామని అన్నారు గ్రామ పంచాయితీ నిధులతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి ఉపసర్పంచ్ సవరప్ప ఎంపిటిసి ఉరుకుందప్ప వెల్ఫేర్ అసిస్టెంట్ ఎర్రి స్వామి మహిళా పోలీస్ సుకన్య సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.